క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్



వినుకొండ(నూజెండ్ల): ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు భవిత సెంటర్ల ఉద్యోగులు ఇంటింటి సర్వే చేపట్టారు. వినుకొండ రూరల్ మండలంలో సర్వే చేపట్టి ఇప్పటి వరకు 40 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో భవిత సెంటర్‌లో పనిచేస్తున్న ఎస్‌ఈఆర్‌పీలు ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఆయా గ్రామాల్లో గుర్తించిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంతో పాటు వారికి ప్రభుత్వ పరంగా అందించే అమ్మ ఒడి, పింఛన్ వంటి పథకాలు వర్తింప చేయడమే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగిస్తున్నట్లు వినుకొండ ఎస్‌ఈఆర్‌పీ సాంబశివరావు తెలిపారు.

భవన నిర్మాణ పనులు పరిశీలన



ఈపూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ రసాయన శాస్త్రం ల్యాబ్ శ్లాబ్ నిర్మాణ పనులను డీఈఓ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ పథకం కింద పాఠశాల అభివృద్ధికి అనేక విధాలుగా తోడ్పడుతుందని ఆయన అన్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా, నాణ్యతగా జరిగేలా చూడాలని స్థానిక ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ విశ్వనాథ్, హెచ్ఎం రామకృష్ణారెడ్డి, పీడీ ఎ.వీరాంజనేయులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి



మృతిచెందిన యలమందయ్య

బొల్లాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బండ్లమోటు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో గుమ్మనంపాడుకు చెందిన నల్లబోతుల యలమందయ్య(51) గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్వగ్రామమైన గుమ్మనంపాడు నుంచి ద్విచక్ర వాహనంపై బొల్లాపల్లి వస్తుండగా బొల్లాపల్లికి చెందిన సత్తెపోగు కోటేశ్వరరావు భార్యతో పాటు బైక్‌పై రేమిడిచర్లకు వెళ్తుండగా మార్గమధ్యంలో బండ్లమోటు గ్రామసమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యలమందయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 ద్వారా వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుమారుడు కనకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసి ఉన్న భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 31 నుంచి జూన్ 2 వరకు మూడు రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 31న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, నవకలశ ఆరాధన, 9 గంటలకు పంచామృత స్నపన, 10 గంటలకు హనుమత్ హోమము, 11 గంటలకు రజత కవచ, పుష్పాలంకరణ, సహస్ర నాగవల్లీదళార్చన, 12 గంటలకు నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ గోష్ఠి, సాయంత్రం 5 గంటలకు హనుమత్ బోనాలు, నగరోత్సవం జరుగుతాయన్నారు. జూన్ 1న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, విశేష పుష్పాలంకరణ, 8 గంటలకు వార్షిక చూత ఫలార్చన, 9:30 గంటలకు సహస్ర మామిడి ఫల విశేషార్చన, సామూహిక గంధ సింధూరార్చన, సాయంత్రం 5 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి 7 గంటల నుంచి అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయన్నారు. జూన్ 2న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 9 గంటలకు విశేష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు పూలంగి సేవ, అనంతరం కొరారు రంజిత్ కుమార్ ఆర్కెస్ట్రా వారిచే భక్త సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయనరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రైతులూ.. నకిలీలతో జర జాగ్రత్త

- విత్తన ఎంపిక కీలకం
- విత్తనాలు, ఎరువులు నకిలీవి వాడితే పంట నష్టం

చిలకలూరిపేట: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతులు ఇప్పుడిప్పుడే సాగుకు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధం అవుతున్న తరుణంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎరువులు, పురుగుమందులు విక్రయించే డీలర్లు కూడా కొన్ని నిబంధనలు పాటించాలని చెబుతున్నారు. 1985 ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం డీలర్లు నిబంధనలు పాటించాల్సి ఉంది.



విత్తనాల బస్తాలు

విత్తనాల కొనుగోలులో అప్రమత్తత...

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలువేసి ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తనం రకం, లాట్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలర్ సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను కొనుగోలు చేయడం మంచిది. హైబ్రీడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను పరిశీలించాలి. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

విత్తనశుద్ధి..

ప్రస్తుతం ఎక్కువగా రైతులు హైబ్రీడ్ విత్తనాలనే వినియోగిస్తున్నారు. వీటిలో అధిక శాతం విత్తన శుద్ధి చేసిన రకాలే దొరుకుతున్నాయి. అయితే విత్తన శుద్ధి చేయాల్సి వచ్చినప్పుడు కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల కార్బన్‌డైజం కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నీటిలో నానబెట్టినట్లయితే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బన్‌డైజంను కలిపి ఆ ద్రావణంలో 24 గంటలు నాగబెట్టాక మడిలో చల్లుకోవాలి. విత్తనం నానబెట్టడానికి ఒక కిలో విత్తనానికి ఒక లీటర్ నీరు సరిపోతుంది. కార్బన్‌డైజం కాకుండా విత్తన శుద్ధికి సూడోమోనాస్ ఫ్లోరసెన్స్ అనే జీవ శిలీంద్రనాశినిని కూడా ఉపయోగించవచ్చు. ఇది వ్యవసాయ శాఖ వద్ద మాత్రమే లభిస్తుంది. దీనికి సంబంధించి కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాముల మందును వినియోగించాలి. దీని వల్ల విత్తనం ద్వారా, భూమి నుంచి శిలీంద్రం ద్వారా వచ్చే తెగుళ్లను సమర్థంగా అరికట్టవచ్చు. కొంతమంది రైతులు సొంత విత్తనాలను వినియోగిస్తున్నారు. గత 10–15 ఏళ్లుగా సొంత విత్తనం తయారీపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. దీంతో కొంతమంది రైతులు సొంత విత్తన తయారీకి అలవాటు పడ్డారు. ఈ విధానం కూడా కల్తీ విత్తనాల బారిన పడకుండా తప్పించుకొనేందుకు ఉపయోగపడుతుంది.

మొలక పరీక్ష....

రైతులు విత్తుకోవడానికి ఒక రోజు ముందు విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. కాని విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత మొలక పరీక్ష చేయించుకోవడం ప్రయోజనదాయకం. రైతు కొనుగోలు చేసిన విత్తనాల నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజలకు పైగా మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకొని, నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. మొలకశాతం కనీసం 75 శాతం వరకు ఉంటే విత్తనాలు నాణ్యమైనవిగా భావించి విత్తుకోవాలి. విత్తనాల ద్వారా వచ్చే తెగుళ్లను విత్తన శుద్ధి చేయడం ద్వారా అరికట్టవచ్చు.

> **నాణ్యమైన విత్తనాలతో దిగుబడులు**
>
> 
>
> రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉంటుంది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ సొసైటీలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద పూర్తి స్థాయిలో ఉండేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత వచ్చే ప్రసక్తి లేదు.
>
> –టి.శ్రీలత, మండల వ్యవసాయాధికారి, చిలకలూరిపేట

ఎరువులు ఇలా..

ఎరువులను విక్రయించేవారు ప్రభుత్వం నుంచి విధిగా గుర్తింపు పొందాలి. నమోదు పత్రంలో పొందుపరిచిన ఎరువులనే విక్రయించాలి. డీలర్లు తమ వద్ద ఉన్న ఎరువులను వాటి ధరలను స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు విధిగా బిల్లులు ఇవ్వాలి. నిర్ణయించిన ప్రమాణం లేని ఎరువులను విక్రయించరాదు. బస్తాలపై చట్టప్రకారం నిర్దేశించిన ప్రమాణికాలు ఉండాలి. కల్తీ, నాణ్యత లోపించిన ఎరువులు, చిరిగిన, తేమ వచ్చిన బస్తాలు ఉంటే వాటిపై ఎర్రటి సిరాతో గుర్తు వేసి పక్కన పెట్టాలి. అటువంటి వాటిని రైతులు కొనుగోలు చేయరాదు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ



తయారు చేసిన వంటకాలను రుచి చూస్తున్న రిసోర్స్‌పర్సన్

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో వారికి పోషక విలువలతో కూడిన వంట తయారు చేసే విధానంపై వారికి శిక్షణ ఇచ్చారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు సన్నద్ధం కావాలని వారు సూచించారు. ముఖ్యంగా వంట తయారు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూరల తయారీలో ఎక్కువ పోషకాలు ఉన్న పదార్థాలను సమమోతాదులో వాడాలన్నారు. అనంతరం వారికి వంటల పోటీలు నిర్వహించారు. వంటలు తయారీ అనంతరం రుచికరమైన పోషక విలువలున్న వంటలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయురాలు వై.భారతి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి రాజనాల కళ్యాణ్‌రావు, మండల విద్యా శాఖాధికారులు వై.ఏసుబాబు, డి.బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.ఎం.సుభానీ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

స్పెషల్ ఫోర్స్ డీఎస్పీ తిరుపతిరావు



కార్డన్ సెర్చ్ అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న స్పెషల్ ఫోర్స్ డీఎస్పీ తిరుపతిరావు

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం, బొల్లాపల్లి గ్రామాల్లో పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. స్పెషల్‌ఫోర్స్ డీఎస్పీ తిరుపతిరావు, వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకరరావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమతులు లేకుండా ఉన్న పది బైక్‌లనులను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ఊరేగింపులు, రెచ్చగొట్టే ప్రదర్శనలు, నినాదాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, గుంపులుగా, గుమికూడి ఉండరాదని సూచించారు. వివాదాలకు, ఘర్షణలకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని, కేసులు నమోదైతే రౌడీషీట్ తెరుస్తామన్నారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్ఐలు డి. చెన్నకేశవులు, ఫిరోజ్, సురేష్, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జె.బలరామిరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ రాజు, చిలకలూరిపేట ఎస్ఐలు జి.రవికృష్ణ, బాలకృష్ణ తనిఖీల్లో పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మారణాయుధాలు, పెట్రోల్ బాంబులు వంటి వాటిని గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

ఇర్లపాడులో..

నాదెండ్ల: సమస్యాత్మక గ్రామమైన ఇర్లపాడులో పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు.

హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన డాక్టర్ల బృందం



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్లు

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం డాక్టర్ ఎ.ఎం. వాసంతి, డాక్టర్ కె.ప్రియ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హెల్త్ సెంటర్ పరిధిలోని ఆశలకు, అంగన్‌వాడీలకు సేవలపై ప్రత్యేక సూచనలు చేశారు. అలాగే అంగన్‌వాడీ, మలేరియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో రొంపిచర్ల ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పి.జగన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సాహస క్రీడా శిక్షణ కేంద్రంగా కొండవీడు

ఎన్‌సీసీ డీడీజీ మధుసూదన రెడ్డి



ఎన్‌సీసీ అధికారి మధుసూదన రెడ్డి

యడ్లపాడు: కొండవీడు సుందర అద్భుత ప్రదేశం మాత్రమే కాదు... సాహస క్రీడలకు ఎంతో అనువైన ప్రాంతమని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డెప్యూటీ డైరెక్టర్ జనరల్(డీడీజీ) ఎయిర్ కమాండర్ వి.మధుసూదన రెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడుకోట ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గుంటూరు నేషనల్ క్యాడెట్ కోర్సు(ఎన్‌సీసీ) బృందంతో విచ్చేసిన ఆయన కొండవీడుకోట కొండలపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, యోగి వేమన మండపం, అనవేమారెడ్డి విగ్రహం, చారిత్రక అంశాలను తెలిపే గ్యాలరీ, పుట్టాలమ్మ, ముత్యాలమ్మ, వెదుళ్ల చెరువుల్ని తిలకించారు. సంస్కృతి– సంప్రదాయం, చారిత్రక అంశాలు, కొండవీడు పాలనవైభవాల గురించి కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం బౌట్ రైవల్ ట్రెక్కింగ్ అకాడమీ దలవాయి ఆషా ఆధ్వర్యంలో ఎత్తైన శిఖరం నుంచి 140 అడుగుల రాప్లింగ్ నిర్వహించారు. వెదుళ్ల చెరువులో కయాకింగ్‌పై బోటింగ్ క్రీడను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఇచ్చే కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు సాహస క్రీడలను ఇకపై కొండవీడుకోటలో నిర్వహించేలా చూస్తామన్నారు. నగరవనం పేరిటా అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షిస్తున్న పచ్చదనం బాగుందన్నారు. అలాగే శిఖరాల్లో సాహస క్రీడలు, కృత్యాలు, అలాగే వెదళ్ల చెరువులో జలక్రీడల నిర్వహణకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు శాశ్వతంగా ఇక్కడే సాహస అంశాలపై శిక్షణ ఇచ్చేలా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. జూన్‌లో మరోసారి పర్యటించనున్నట్లు చెప్పారు. పరిపాలన తనిఖీల్లో భాగంగా గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్‌ను సందర్శించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: నాదెండ్ల శివారు గ్రామమైన జాష్టివారిపాలెంలో కొలువైయున్న శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 150 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో పెద్దలు ఆలయం నిర్మించారు. పురాతన ఆలయం జీర్ణావస్థకు చేరుకోవటంతో 2019లో ఆలయాన్ని పునర్నిర్మించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజారి మేకల నాగరాజు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు యలగాల వెంకటేశ్వర్లు, దామనబోయిన సాంబశివరావు, మార్త నారాయణబాబు, యలగాల నాగేశ్వరరావు, అంగిరేకుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, యలగాల అప్పారావు ఉన్నారు.

ట్రాక్టర్‌లో ఇరుక్కుని వ్యక్తి మృతి

సత్తెనపల్లి: ప్రమాదవశాత్తూ పొలం దున్నుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన ఇస్తల రోశయ్య (40) ట్రాక్టర్‌తో గ్రామానికి చెందిన కారుమంచి రామకోటయ్య పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్నుతుండగా ట్రాక్టర్ ఇంజన్‌కు ఉన్న హైడ్రాలిక్ పలిటి నాగలికి బిగించి ఉన్న లిఫ్ట్ వైర్లు సరిచేయడానికి హైడ్రాలిక్ ఇనుప నాగలి రన్నింగ్‌లో ఉండగానే రోశయ్య నిర్లక్ష్యంగా డ్రైవర్ సీటు కింద నుంచి దూరి వైర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తూ హైడ్రాలిక్ ఇనుప నాగలి, డ్రైవర్ సీటుకు మధ్య రోశయ్య ఇరుక్కుపోయి గుండెకు హైడ్రాలిక్ ఇనుప నాగలి ఒత్తుకొని పోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఇస్తల బుజ్జి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ సీఐ మల్లి రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర




ఎన్ఈసీ చైర్మన్‌తో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎన్‌సీసీ డీడీజీ వి.మధుసుదనరెడ్డి

నరసరావుపేట రూరల్: దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకంగా ఉంటుందని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ హెడ్, డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వి.మధుసుదనరెడ్డి తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయనకు గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కళాశాలలో జరుగుతున్న ఎన్ఎసీడీ కార్యక్రమాలు, క్యాడెట్స్‌కు నిర్వహిస్తున్న క్యాంప్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ సాధించిన అఛీమెంట్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్, 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్‌గౌతమ్, కల్నల్ సంజయ్ గుప్తా పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి అష్టోత్తర శత కలశాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



అష్టోత్తర శత కలశాభిషేకాలు చేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో స్వామి వారికి షష్టి పురస్కరించుకొని అష్టోత్తర శత కలశాభిషేకం, స్వామి వారికి భస్మముతో విశేషాలంకారం నిర్వహించారు. అనంతరం సహస్ర నామార్చన 108 మామిడి పండ్లతో పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు గుదే నాగ సతీష్, దేవాలయ అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వర శర్మ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



హుటాహుటిన చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థినికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన టెన్త్ విద్యార్థిని అనురాధ రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు వెళ్లింది. పరీక్ష రాసి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుపై ఉన్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విద్యార్థినికి గాయాలయ్యాయి.

శివాజీ మహారాజ్ జననం శివనేరి దుర్గం పుస్తకావిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో జూన్ 9న హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ అధ్యక్షుడు సింధు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం శివాజీ మహారాజ్ జననం శివనేరి దుర్గం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పులహరి భానుజీ మాట్లాడుతూ జూన్ 9న జరిగే శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణకు వివిధ జిల్లాల్లో ఉన్న ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నర్సోజి, పి.గోవిందు, రామసాయి, విశ్వనాథ ప్రభు, కరుణాకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వృక్ష ప్రేమికుడు గాలిబ్ మృతి



గాలిబ్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

నాదెండ్ల: వృక్ష ప్రేమికుడు, రిటైర్డ్ సొసైటీ ఉద్యోగి షేక్ పెద్ద గాలిబ్(87) బుధవారం మృతి చెందారు. ఈయన 1982 నుంచి ఇరవై ఏళ్ల పాటూ గణపవరం వ్యవసాయ సహకార సొసైటీలో పనిచేశారు. అప్పట్లో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి నాదెండ్ల డొంక రోడ్డులోని మేజర్‌కాలువ వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి ప్రతిరోజూ వాటిని సంరక్షించారు. ప్రస్తుతం ఈ రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పెద్ద పెద్ద వృక్షాలతో పచ్చగా, చల్లటి నీడనిస్తున్నాయి. గాలిబ్ మృతికి చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి కెల్లంపల్లి సుందరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాట్రు రమేష్, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ తులం సుధాకర్, నాయకులు కొండెపాటి నాగయ్య, అవ్వారు సుబ్రహ్మణ్యం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. గాలిబ్‌కు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఈయన కుమారుడు షేక్ ఆదంవలి ప్రస్తుతం గణపవరం ఐదో వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందారు.

నైపుణ్యమే ఉపాధి



మాట్లాడుతున్న హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు బుల్లిబాబు

సత్తెనపల్లి: విద్యార్థి దశలో ప్రతి అవకాశాన్ని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేర్చుకునే పనిపై శ్రద్ధ పెట్టి నేర్చుకున్నట్లయితే ఆ నేర్చుకున్న నైపుణ్యమే భవిష్యత్తులో మనకి భరోసానిస్తుందని, ఆ నైపుణ్యమే మన జీవితంలో మనకి ఉపాధినిస్తుందని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ, ఉపాధి సెంటర్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సెంటర్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సభ్యుడు సుభాని మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. బాలికలు, మహిళలు ఆర్థిక స్వాతంత్య్రం సంపాదించినప్పుడు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిసర ప్రాంత పదవ తరగతి ఆపై చదువుకున్న 18–40 సంవత్సరముల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ట్రైనింగ్ సెంటర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ టీచర్ షేక్ మీరాబి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 557 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 478 మంది హాజరయ్యారు. 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఫిజిక్స్, ఎకానామిక్స్ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 266 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 223 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ శైలజాకుమారి తెలిపారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ నగదు

నకరికల్లు: జూన్ నెల 1వ తేదీన కూడా పింఛన్‌లను ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఎంపీడీవో డి.జయమణి బుధవారం తెలిపారు. ఇళ్లకే పరిమితమై బ్యాంకులకు వెళ్లలేని వారికి సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తారని అన్నారు. పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన పింఛన్ నగదును అదే రోజు నుంచి తీసుకోవచ్చన్నారు.